క్లుప్తంగా

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ తమ ఇంటి చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ శ్వేత అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయం-1 పరిధిలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. 97 మందికి షుగర్, బీపీ పరీక్షలు ఆరోగ్య సిబ్బంది చేశారు. వారిని వైద్యురాలు శ్వేత పరీక్షించి నెలకు సరిపడా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాలువల్లో మురుగు నిల్వ ఉండకుండా చూడాలని, తాగునీరు ఎక్కువ రోజులు నిలువ చేయకుండా చూసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వయోవృద్ధులకు ఆరోగ్య పరీక్షలు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కండ్రిక మహిళ మండలి వయోవృద్ధుల ఆశ్రమంలో గురువారం అటల్ వయో అభ్యుదయ యోజన కార్యక్రమం కింద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో (జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్) రోహిణి, ఎన్‌సీడీ జిల్లా కన్సల్‌టెంట్ డాక్టర్ గిరిధర్‌లు మాట్లాడుతూ దీని ద్వారా వృద్ధులకు ముందుగానే జిల్లా నుంచి వచ్చిన ఆరోగ్య సిబ్బంది రక్త పరీక్షలు, ఈసీజీ పరీక్షలు చేసి ఉంచుతారన్నారు. ఈ రోజు పరీక్షలు చేయించుకున్న వారిని పరిశీలించి మందులు అందజేసినట్లు తెలిపారు. వివిధ విభాగాలకు చెందిన ఈఎన్‌టీ, ఫిజియోథెరఫీ, ఆప్తమాలజిస్ట్, డెంటిస్ట్, గైనిక్, జనరల్‌కు సంబంధించిన వైద్యులు పాల్గొని పరీక్షలు చేశారన్నారు. వైద్య శిబిరంలో వైద్యులు శ్వేత, నివేదిత, సుప్రియ, స్వప్న, విజయలక్ష్మీ, ఆశీర్వాదం, హెచ్‌ఎస్ షేక్, అబ్దుల్ రెహమాన్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొలిక్కిరాని బంగారం చోరీ కేసు

మంగళగిరి: ఆత్మకూరు అండర్ పాస్ వద్ద ఈ నెల 15వ తేదీన జరిగిన 5 కేజీల బంగారం చోరీ కేసులో ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి కనిపించలేదు. వివిధ కోణాలలో ఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఏఎస్పీ సుప్రజ నేతృత్వంలో మూడు బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేస్తున్నారు. ఫిర్యాదుదారుడు దివి నాగరాజుతో పాటు మరొక యువకుడిని గురువారం సీసీఎస్ పోలీసులు గుంటూరు తరలించి విచారణ చేపట్టారు. మరో వైపు నాగరాజును విచారణ చూసి చూడనట్లు వదిలేయాలని రాజకీయ ఒత్తిళ్లు పోలీసులుపై పెరిగినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మరో రెండు మూడు రోజులలో విచారణ కొలిక్కి వస్తుందని ఆశిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మోరంపూడిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



దుగ్గిరాల: మండలంలోని మోరంపూడి గ్రామంలో ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు తరపున గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఓటు కలిగిన పట్టభద్రుల ఓటర్లను కలిసి తమ అమూల్యమైన ఓటు పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావుకు వేసి ఆయనను అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో కార్మిక నాయకుడు జెట్టి బాలరాజు, వై.బ్రహ్మేశ్వరరావు, జి.నాగేశ్వరరావు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మణరావును గెలిపించుకుందాం



తాడేపల్లిరూరల్ : కృష్ణా గుంటూరు పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ ప్రజా సంఘాల నాయకులు గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ఉండవల్లి, ర్యాంపు, ఎన్‌టీఆర్ కట్ట, కృష్ణ నగర్‌లోని పలు ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణీ చేస్తూ ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు, ఆశ, అంగన్‌వాడీ, స్కీం వర్కర్లు సమస్యలపై పోరాడే శక్తులను గెలిపించుకోవాలని అన్నారు. ప్రజల సమస్యలపై శాసనమండలిలో తన గళాన్ని వినిపించే లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, ఎ.శవిరిభర్తలోం, యేసయ్య, రాయన్న, కె.బాబూరావు, కె.మేరి, దేవకుమార్, టి.బక్కిరెడ్డి, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అరచేతిలో.. సకల సేవలు

ఈ యాప్‌తో.. కష్టాలకు ఫుల్‌స్టాప్

- ఫోన్ చేస్తే చాలు టెక్నీషియన్లు ఇంటికి వచ్చేస్తారు
- ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చిన మెప్మా
- వచ్చే నెలలో వినియోగంలోని రానున్న సేవలు



మొబైల్ యాప్

మంగళగిరి టౌన్ : ఇంట్లో ట్యాప్ లీకవుతుందా..? మరమ్మతుల కోసం ప్లంబర్‌ను వెతుకుతున్నారా..? ఏసీ పనిచేయడం లేదని టెక్నీషియన్ కోసం ఆరా తీస్తున్నారా..? ఇటువంటి అవసరాలకు ఇకపై ఎవరినీ వెతుక్కోవలసిన అవసరం లేదు. స్మార్ట్‌ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు.. ఇంటికే వచ్చి మరమ్మతులు చేసి వాటి చార్జీలు తీసుకుంటారు. మంగళగిరి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మెప్మా సమన్వయంతో 'హోమ్ ట్రయాంగిల్' పేరిట ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. వివిధ రంగాలలో పనివారిని ఇందులో భాగస్వామ్యులను చేస్తున్నారు.

యాప్ డౌన్‌లోడ్ ఇలా...

అర్బన్ ప్రాంతాల్లో గృహ అవసరాల కోసం హోమ్ ట్రయాంగిల్ పేరుతో ఈ యాప్‌ను సిద్ధం చేశారు. స్మార్ట్‌ఫోన్‌లోని ప్లే స్టోర్‌కు వెళ్లి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆ తరువాత మొబైల్ నెంబర్, ఇంటి చిరునామా తదితర వివరాలను అందులో నమోదు చేయాలి. ఫోన్ నెంబర్ ఆధారంగా లొకేషన్ సేవ్ అవుతుంది.

ఇలా వినియోగించుకోచ్చు...

ఇంట్లో విద్యుత్, పైపులైన్లు, పరికరాల పరంగా సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు వీరిని ఉపయోగించుకోవచ్చు. నేరుగా యాప్ క్లిక్ చేస్తే మెనూ ఓపెన్ అవుతుంది. అందులో సమస్యను ప్రస్తావించాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఒక ఎలక్ట్రీషియన్ అవసరం ఉంటే ఆ ఐచ్ఛికను క్లిక్ చేయాలి. దీంతో వెంటనే అందుబాటులో ఉండే ఎలక్ట్రీషియన్ వివరాలు, ఫోన్ నెంబర్లు సెల్‌ఫోన్‌లో కనిపిస్తాయి. అలాగే ప్లంబర్, ఎలక్ట్రీషియన్, సెలూన్, టీవీ, గ్యాస్ స్టౌ రిపేర్లు ఇలా పలు రకాల సేవలు అందించడానికి యాప్‌లో ఆయా నైపుణ్యం గల వారి నెంబర్లుంటాయి. వారితో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకునే సౌలభ్యం కూడా ఉంది.

ఈ సేవలు పొందవచ్చు...

బ్యూటీ పార్లర్‌కు వెళ్లేవారు నేరుగా ఇంటివద్దే ఆయా సేవలు పొందవచ్చు. నగరంలో పేరున్న సంస్థలు, బ్యూటీ పార్లర్ల వివరాలు అందుబాటులో ఉంటాయి. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు సంబంధించి ఈవెంట్ సంస్థల వివరాలు యాప్‌లో ఉంటాయి. పెంపుడు జంతువులకు స్నానం చేయించి, శుభ్రం చేయడం దగ్గర నుంచి హౌస్ క్లీనింగ్ వరకు అన్ని రకాల సేవలకు సంబంధించిన వారి వివరాలు యాప్‌లో పొందవచ్చు.

తొలివిడత శిక్షణలో...

మంగళగిరి నగర పరిధిలో ఎలక్ట్రీషియన్లు, టీవీ టెక్నీషియన్లు, ఏసీ, ఫ్రిజ్, వాషింగ్‌మిషన్, ప్లంబర్, కార్పెంటర్, లేడీస్ అండ్ జెంట్స్ సెలూన్లు తదితర వాటిలో ప్రావీణ్యం ఉన్నవారు 86 మంది ఇప్పటి వరకు ఇందులో నమోదు చేయించుకున్నారు. వీరికి త్వరలో శిక్షణ ఇచ్చి అనంతరం వీరి ఫోన్ నెంబర్లు, పేర్లు తదితర వివరాలను యాప్‌లో నమోదు చేస్తారు. కృష్ణ, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ పూర్తయిన తరువాత మార్చి 8వ తేదీన ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

86 మంది టెక్నీషియన్లను నమోదు చేయించాం



ఇప్పటి వరకు 86 మంది టెక్నీషియన్లను మెప్మాలో నమోదు చేయించాం. రోజువారీ పనుల కోసం సెంటర్‌లో నిలబడి ఎదురు చూడడం, ఎవరైనా వచ్చి పని ఇస్తారా అంటూ వెతుక్కోవడం జరుగుతోంది. చాలా మందికి వర్కర్స్ అవసరమున్నా సెంటర్‌కు వచ్చి తీసుకువెళ్లడానికి కొంత సమయం పడుతుంది. ఈ యాప్ అందుబాటులోకి వచ్చిన తరువాత ఫోన్‌లో నెంబర్ చూసి అడ్రస్ చెబితే వర్కర్లు ఇంటికి వచ్చి పనిచేస్తారు. దీని వలన ఎంతో సమయం కలసి వస్తుంది.

– కె.మాలతి రెడ్డి, సీఎంవో, మంగళగిరి మెప్మా

పని పెరిగే అవకాశాలు ఉన్నాయి



ఏ సెంటర్‌లో పని కావాలంటే ఆయా సెంటర్లలో వర్కర్లను తీసుకుంటారు. దీని వల్ల యజమానికి వర్కర్స్ కోసం తిరగాల్సిన పని లేదు. పైగా ఆయా సెంటర్లలోని వర్కర్స్ కావడం వలన ఇబ్బంది ఉండదు. ఈ యాప్ వల్ల వర్కర్స్‌కు పని పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

– షేక్ యూసుబ్ అలి, ఏసీ టెక్నీషియన్, మంగళగిరి

ఓటు హక్కు వినియోగించుకొనేలా పట్టభద్రులను చైతన్య పరచాలి

డిప్యూటీ కలెక్టర్ ఎ.లక్ష్మీకుమారి



ర్యాలీలో పాల్గొన్న డిప్యూటీ కలెక్టర్ లక్ష్మికుమారి, తహసీల్దార్

దుగ్గిరాల: పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకొనేలా చైతన్య పరచాలని అధికారులకు డిప్యూటీ కలెక్టర్ ఎ.లక్ష్మీకుమారి సూచించారు. గురువారం డాక్టర్ కేఆర్ఎం డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి పాల్గొని మాట్లాడారు. మంచి సమాజం కోసం మంచి నాయకులను ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తహసీల్దార్ ఐ.సునీత మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిదని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. సదస్సుకు కళాశాల ప్రిన్సిపాల్ కొత్త గిరిధరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ కె.సంజీవరావు, జూనియర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ కె.రమాదేవి, ఎన్ఎస్ఎస్ అఫీసర్ బి.రాంబాబు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

- అదే విధంగా ఎమ్మెల్సీ ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నుంచి శివాలయం సెంటర్ వరకు అవగాహన ర్యాలీని నిర్వహించారు. శివాలయం కూడలిలో మానవహారంగా ఏర్పడి పట్టభద్రులు అంతా ఓటు హక్కు వినియోగించుకోవాలని నినాదాలు చేశారు. డిప్యూటీ కలెక్టర్ ఎ.లక్ష్మీకుమారి అధికారులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు, ఎస్ఐ వెంకట రవి, హౌసింగ్ ఏఈ, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో మరిన్ని సేవలకు కృషి



సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

మంగళగిరి: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంగళగిరి శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు మరిన్ని సేవలందించేందుకు కృషి చేస్తున్నట్లు సబ్ బ్రాంచ్ చైర్మన్ ఇసునూరి చక్రవర్తి తెలిపారు. గురువారం రెడ్ క్రాస్ సొసైటీ మూడవ వార్షికోత్సవం నగర పరిధిలోని లిటిల్ విలేజ్ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా 2023-24 వార్షిక నివేదిక, 2023-24 సంవత్సర ఆడిట్ చేయబడిన ఆర్థిక నివేదిక, 2025-26, 2026-27 సంవత్సరాల ప్రణాళికలను మంగళగిరి పరిసర ప్రాంతాల ప్రజలకు రెడ్ క్రాస్ అందించవలసిన సేవలపై పలు తీర్మానాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించినట్లు చక్రవర్తి తెలిపారు. బ్లడ్ డోనర్స్ పేషెంట్స్‌ను అనుసంధానం చేయుటకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి బ్లడ్ డోనర్స్ యాప్ ఒకటి తీసుకురావాలని నిర్ణయించి కేపీఎస్ ప్రకాష్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేశారు. సమావేశంలో సొసైటీ ప్రతినిధులు గాజుల శ్రీనివాసరావు, అందె మురళి, షేక్ సలార్, గుంటి నాగరాజు, ప్రగడ రాజశేఖర్, పారేపల్లి నిరంజన్ గుప్తా, అందే రేవంత్, కందుల నాగార్జున, బట్టు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అలీమ్ బాషా

మంగళగిరి టౌన్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని బ్యాంక్ కాలనీ, కొప్పురావు కాలనీ తదితర ప్రాంతాల్లో గురువారం ఉదయం పారిశుద్ధ్య పనులను ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా పరిశీలించారు. పలు దుకాణాల ముందు చెత్త వేసి ఉండడం, మురుగు కాలువలో చెత్త బ్లాక్ అయి రోడ్డుపైకి నీరు వస్తుండడాన్ని గమనించి దుకాణదారులకు సూచనలు చేశారు. చెత్తను అధికంగా వేస్తున్న ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగయ్యేలా పారిశుద్ధ్య సిబ్బందికి సూచనలు అందజేశారు. ఆయా ప్రాంతాల్లో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం పాతబస్టాండ్ ప్రాంతంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. అన్న క్యాంటీన్‌లో పరిశుభ్రత, అల్పాహారం తీరును పరిశీలించారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

మంగళగిరి టౌన్ : వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళగిరి నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం గురువారం ఒక ప్రకటన జారీ చేసింది. అన్ని వర్గాలకు సముచిత న్యాయం చేసినందుకు వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, మంగళగిరి నియోజకవర్గ కన్వీనర్ దొంతిరెడ్డి వేమారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తమకు ఇచ్చిన అవకాశాన్ని వమ్ము చేయకుండా శక్తివంచన లేకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన వారు అన్నారు.

వింగ్ పేరు	అధ్యక్షులు
యూత్	సయ్యద్ గౌజ్ మొహిద్దీన్
మహిళా విభాగం	చిలువూరి ఫిలోమినా
రైతు విభాగం	బండాపు రుక్మాంగ రెడ్డి
బీసీ సెల్	తాడిబోయిన సుబ్బారావు
ఎస్సీ సెల్	కట్టెపోగు భూషణం
ఎస్టీ సెల్	మేడా చైతన్య
మైనార్టీ సెల్	షేక్ జానీ బాషా
క్రిస్టియన్ మైనార్టీ సెల్	చిలకా విక్టర్ ఇమ్మానుయేల్
స్టూడెంట్	పులగం సందీప్ రెడ్డి
పంచాయతీ రాజ్	ఈపూరి ఆదామ్
మున్సిపల్	చిట్టిమళ్ళ సుబ్బారావు
ఆర్‌టీఐ	ఉండ్రు కళ్యాణ్ కుమార్
వలంటీర్	దార్ల సత్యనాథ్
గ్రీవెన్స్ సెల్	ఎర్రగూటి మల్లికార్జున రెడ్డి

వింగ్ పేరు	అధ్యక్షులు
వాణిజ్యం	చాదలూరి మల్లేశ్వరరావు
వీవర్స్	పూజల మనోహర్
వైఎస్సార్‌టీయూసీ	రత్నాకర్ శ్రీనివాసరాజు
అంగన్‌వాడీ	శాఖల సుజాత
లీగల్ సెల్	కలకోటి సునీల్‌కుమార్
కల్చరల్	పల్లపాటి సురేష్
సోషల్ మీడియా	భీమిరెడ్డి శరణ్ కుమార్
రెడ్డి ఐటీ	గుంటక నితిన్ రెడ్డి
దివ్యాంగుల విభాగం	వేమూరి వందనం లిజాక్
డాక్టర్స్	డాక్టర్ మమెన్ బాల మురళీకృష్ణ
పబ్లిసిటీ	తిరుమలశెట్టి సురేంద్ర కుమార్
బూత్ కమిటీలు	దర్శి రమేష్ బాబు
ఇంటలెక్చ్యువల్ ఫోరం	జంగా నాగిరెడ్డి

ఎస్ఆర్ఎంలో నూతన కోర్సులు ప్రారంభం



కోర్సులను వివరిస్తున్న రుహెబీర్ సింగ్

మంగళగిరి టౌన్: ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో గురువారం నుంచి ఆమేయా పేరిట రెండు రోజుల పాటు జరుగుతున్న బిజినెస్ ఫెస్ట్‌ను పురస్కరించుకుని యూనివర్సిటీలోని ప్యారీ బిజినెస్ స్కూల్ నూతన బీకాం కోర్సులను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. తాత్వాక్ గ్లోబల్ అనలిటికల్ సంస్థ సీఈవో రుహెబీర్ సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని కోర్సులను ప్రారంభించారు. 2025 నుంచి ఈ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతాయని ప్యారీ బిజినెస్ స్కూల్ డీన్ డాక్టర్ భరద్వాజ శివకుమారన్ పేర్కొన్నారు. ఇంటర్ పూర్తయిన విద్యార్థులు ఈ కోర్సులో చేరుందుకు అర్హులని, ఆసక్తి గల విద్యార్థులు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సీఏ చదవాలనుకునే విద్యార్థులకు సీఏ ఇంటిగ్రేటెడ్ బీకాం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ రంగాల్లో స్థిరపడాలనుకునే వారికి ఈ కోర్సు మంచిదని వివరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రేమ్ కుమార్, కామర్స్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ లక్ష్మణరావు, వీసీ మనోజ్‌కుమార్ అరోరా, బార్ క్లేస్ బ్యాంక్ ఎండీ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి

సాగునీటి కోసం మిర్చి రైతులు అష్టకష్టాలు



మందపాడు చెరువు నుంచి నీటిని తోడుతున్న ఆయిల్ ఇంజన్లు



రోడ్డు కిరువైపులా పరిచిన నీటి పైపులు



పంట పొలంలో నీటి తడులు పెడుతున్న రైతు

తాడికొండ: ఈ ఏడాది మిర్చి రైతుల పరిస్థితి అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి అన్న చందంగా తయారైంది. గతేడాది రూ.22 వేలు పలికిన మిర్చి ఇప్పుడు రూ.10 వేలు పలకడం కష్టంగా మారిన నేపథ్యంలో అన్నదాతల ఆవేదన అంతా ఇంతా కాదు. ఓ వైపు ధరలు పతనమై పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేక దీనంగా ఎదురుచూపులు చూస్తున్న మిర్చి రైతులకు సకాలంలో సాగుకు నీరందించ లేక ప్రభుత్వం, అధికారులు చేతులెత్తేయడంతో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. సాగర్ కాల్వలకు చుక్క నీరందించని కారణంగా మిర్చికి తడులు వేసేందుకు ఎక్కడా నీటిజాడ కనిపించడం లేదు. వరుణ దేవుడు కినుకు వహించడంతో గత 3 నెలలకు పైగా వర్షపు చుక్క నేలను తాకిన పరిస్థితి లేక రైతులకు పొలాల్లోని నీటి కుంటల్లో ఉన్న కొద్దిపాటి నీరు సైతం పూర్తిగా ఇంకిపోయి పై పాటుగా మందులు పిచికారీకి కూడా నీటిని వెతుక్కోవాల్సిన పరిస్థితి వచ్చింది. రైతుల దీన స్థితిని గమనించి ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి ఆరుగాలాలు శ్రమించి పండించిన మిర్చి పంటను కాపాడుకునేందుకు సాగర్ కాల్వల ద్వారా సరిపడా సాగునీటిని అందించి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

దుకాణంలో అగ్ని ప్రమాదం



మంగళగిరి టౌన్ : మంగళగిరి నగర పరిధిలోని గాంధీబొమ్మ సెంటర్‌లో ఉన్న ఓ నిత్యావసర వస్తువుల హోల్‌సేల్ దుకాణంలో బుధవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. మంగళగిరి పట్టణానికి చెందిన ఎం.నాగేశ్వరరావు కొన్ని సంవత్సరాలుగా శ్రీసాయి ఎంటర్‌ప్రైజెస్ పేరుతో నిత్యావసర వస్తువుల హోల్‌సేల్ దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి 11.30 గంటల సమయంలో షాపులో నుంచి దట్టమైన పొగలు రావడం రైస్ షాపు మూసివేసి వెళుతున్న ఓ వ్యక్తి గమనించాడు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి, షాపు యజమాని నాగేశ్వరరావుకు సమాచారం అందించాడు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి షట్టర్లు తెరచి మంటలను అదుపు చేశారు. మంటలను అదుపుచేయడానికి సుమారు 2 గంటల సమయం పట్టింది. నిత్యావసర వస్తువుల దుకాణం కావడంతో నూనె, ఇతర సామగ్రి, ప్లాస్టిక్ వస్తువులు, వివిధ రకాల విలువైన సామగ్రి ఉండడంతో మంటలు భారీ ఎత్తున ఎగసి పడ్డాయి. దుకాణంలో కంప్యూటర్, ఏసీ, ప్రింటర్, సీసీ కెమెరాలు, ఓ టేబుల్ అగ్నికి ఆహుతయ్యాయని, భారీ మొత్తంలో నిత్యావసరాలు పూర్తిగా పాడైపోయాయని దుకాణ నిర్వాహకుడు తెలిపారు. మంటలు అదుపులోకి రావడంతో సమీపంలో ఉన్న దుకాణదారులు ఊపిరి పీల్చుకున్నారు.

టాస్క్ చేసుకో.. రెట్టింపు డబ్బు అందుకో

- ఆన్‌లైన్ యాప్ ద్వారా మోసపోయిన యువతి
- 1930కి ఫిర్యాదు



టెలిగ్రామ్‌లో యువతికి వచ్చిన మెసేజ్‌లు

మంగళగిరి టౌన్ : ఇచ్చిన టాస్క్ చేసి మీరు డిపాజిట్ చేసే మొత్తంకు రెట్టింపు పొందవచ్చు అని ఒక యాప్‌లో రావడంతో మంగళగిరి పట్టణానికి చెందిన ఓ యువతి ఆకర్షితురాలై మోసపోయిన ఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం మంగళగిరి నగర పరిధిలో ఎన్‌టీఆర్ వైద్యసేవ ట్రస్ట్‌లో పనిచేస్తున్న ఓ యువతి టెలిగ్రామ్ యాప్‌లో వచ్చిన మెసేజ్‌ను చూసి ఆకర్షితురాలైంది. మేము ఇచ్చిన టాస్క్ పూర్తి చేస్తే మీరు డిపాజిట్ చేసిన మొత్తానికి రెట్టింపు డబ్బులు వస్తాయని చెప్పడంతో ఆ యువతి అక్టోబర్ 14, 2024న ఫోన్‌పే ద్వారా మొదట రూ.1000, రూ.2 వేలు, మరలా వెయ్యి రూపాయలు డిపాజిట్ చేసింది. అయినా ఎటువంటి సమాచారం లేకపోవడంతో వాట్సాప్‌లో మెసేజ్ చేసింది. మీ బోనస్ స్ట్రక్ అయిందని, మా రిసెప్షనిస్ట్ నుంచి రిప్లయ్ వస్తుందని చెప్పారు. మరలా నెక్స్ట్ టాస్క్ ఉంటుందని, ఆ టాస్క్‌లో పాల్గొనమని తొందర పెట్టారు. దీంతో నమ్మిన ఆ యువతి రూ.7 వేలు ఒకసారి, రూ.15 వేలు, అనంతరం రూ.39,550 వెంట వెంటనే గూగుల్‌పే, ఫోన్‌పేల ద్వారా పంపించింది. అయితే వారి నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో ఇది స్కామ్ అని ఆలస్యంగా గుర్తించి అదే రోజు వెంటనే 1930కి ఫిర్యాదు చేసింది. దీనిపై ఎలాంటి స్పందన లేకపోవడంతో గురువారం మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ స్కామ్ వల్ల పోగొట్టుకున్న రూ.65,550 నగదును ఇప్పించాలని ఆ ఫిర్యాదులో ఆమె పేర్కొంది.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

తాడేపల్లిరూరల్ : ఇటీవల తాడేపల్లి రూరల్ సీతానగరంకు చెందిన చన్నంశెట్టి వెంకట సత్యనారాయణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. చిల్లపల్లి మాట్లాడుతూ జనసేన తరపున రూ.5 లక్షల ఇన్సూరెన్స్‌తో పాటు కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కోటేష్ బాబు, కోమలి, తిరుపతిరావు, నాగేశ్వరరావు, జొన్న రాజేష్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా పంట పొలాలు



మందుబాబులు మద్యం తాగి వదిలివేసిన వ్యర్థాలు



మందుబాబులు పడవేసిన బీరు సీసాలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణ, రూరల్‌తో పాటు పలు ప్రాంతాల్లో మందుబాబుల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. తాడేపల్లి పట్టణ పరిధిలోని సుందరయ్య నగర్ 40 అడుగుల రోడ్డుతో పాటు వివిధ ప్రాంతాల్లో, పంట పొలాల మధ్య ఉన్న బార్లు, వైన్‌షాపులతో రైతులకు, నివాస దారులకు పెద్ద తలనొప్పిగా మారింది. మందుబాబులు రాత్రి వేళల్లో ఇష్టానుసారం మద్యం తాగి ఖాళీ సీసాలను పగలగొట్టి పంట పొలాల్లో వదిలేసి వెళుతున్నారు. దీంతో రైతులు తెల్లవారుజాము పంట పొలాల్లోకి వెళ్లేటప్పుడు వారికి ఆ సీసా పెంకులు కాళ్లలో గుచ్చుకుని గాయాలు అవుతున్నాయి. మందుబాబులు తాగి పడవేసిన సీసాలను రైతులు ఉదయం పొలానికి వచ్చి ఏరుకుని పక్కన పడేయాల్సి వస్తోంది. ఇక రాత్రి సమయంలో అయితే మహిళలు ఆ రహదారుల్లో తిరగాలంటేనే భయపడుతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి పంట పొలాల మధ్య, నివాసాల మధ్య ఉన్న బార్, వైన్ షాపులను తొలగించాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.

